క్లుప్తంగా

భారీ అన్నసమారాధన



శ్రీషిర్డీ సాయిబాబా ఆలయం వద్ద అన్నదానం చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

తగరపువలస : మెయిన్ రోడ్డులోని శ్రీ సంపత్ వినాయక సహిత షిర్డీ సాయిబాబా ఆలయం 20వ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు సోమవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పలువురు భక్తులతోపాటు వ్యాపారులు సహకారం అందించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమానికి రామాయణం కామేశ్వరప్రసాద్ శర్మ, కొప్పల కృష్ణ, శంకర్, వెంపాడ శ్రీనివాసరెడ్డి, గుజ్జు సూరిబాబు తదితరులు సహకారం అందించారు.

రూ.100 కోట్లతో పరిశోధన కేంద్రాలు



వివరాలు తెలుపుతున్న వీసీ దయానంద సిద్దవట్టం

కొమ్మాది : విజ్ఞాన శాస్త్ర పరిశోధనలు బలోపేతం చేయడానికి, అంతర్జాతీయ స్థాయిలో ర్యాంకింగ్ సాధించడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం రూ.100 కోట్లతో విశాఖ, హైదరాబాద్, బెంగళూరు ప్రాంగణాల్లో మల్టీ డిసిప్లీనరీ యూనిట్ ఆఫ్ రీసెర్చ్ ఆన్ ట్రాన్సిలేషన్ ఇన్షియేటివ్స్ (మూర్తి) పరిశోధన కేంద్రాలను అభివృద్ధి చేస్తుందని వీసీ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం తెలిపారు. బోధనతోపాటు పరిశోధనలోనూ విశ్వవిద్యాలయాన్ని అంతర్జాతీయ స్థాయిలో నిలపడానికి ప్రణాళికాయుతంగా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ నెల 28న బెంగళూరులో మూర్తి పరిశోధన కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు.

నివాసాల మధ్య సెల్‌టవర్ వద్దు

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు గాంధీ బొమ్మ వీధిలో నివాసాల మధ్య సెల్‌టవర్ నిర్మాణం వద్దని కోరుతూ సోమవారం స్థానికులు 'స్పందన'లో భీమిలి జెడ్సీ కనక మహాలక్ష్మికి ఫిర్యాదు చేశారు. నగరపు వీధిలోని జగుపల్లి సూరిబాబు ఇంటిపై టవర్ నిర్మాణానికి జరుగుతున్న ఏర్పాట్లను అడ్డుకోవాలని కోరుతూ స్థానికుల సంతకాలతో కూడిన వినతి పత్రం అందించారు. దీనిపై ఆందోళనకు కూడా దిగుతామని హెచ్చరించారు.

అప్పన్నను దర్శించుకున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు



ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు ప్రసాదం అందజేస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని సోమవారం భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దర్శించుకున్నారు. ఆలయంలోని కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు స్వామికి అష్టోత్తరం పూజ నిర్వహించి వేద ఆశీర్వచనం ఇచ్చారు. స్వామివారి ప్రసాదాన్ని, శేషవస్త్రాన్ని ఈవో శ్రీనివాసమూర్తి అందజేశారు.

నేడు అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: బురుజుపేటలో కొలువైన కనక మహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం జరిగే పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి.

పథకాల అమలులో వలంటీర్లే కీలకం

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



బాలాజీనగర్ వలంటీర్ రమణను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తదితరులు



శ్రీనగర్ సచివాలయ వలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, నాయకులు

తగరపువలస : రాష్ట్ర వ్యాప్తంగా సంక్షేమ పథకాల అమలులో వలంటీర్లే ముఖ్యపాత్ర పోషిస్తున్నారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. చిట్టివలస బంతాట మైదానంలో జీవీఎంసీ 1, 2, 3 వార్డుల వలంటీర్లకు సోమవారం పురస్కారాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారులు, నాయకులు, ప్రజా ప్రతినిధుల కంటే వలంటీర్లకే ప్రాధాన్యత కల్పించి అవినీతి, వివక్షకు తావులేకుండా నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు సంక్షేమ పథకాలు చేరుస్తున్నారన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీల సభ్యులు కమీషన్లు తీసుకుని కొందరికే సంక్షేమ పథకాలు అందించేవారన్నారు. తాను రెండేళ్లుగా నియోజకవర్గంలో 127 సచివాలయాల పరిధిలో ప్రజల ఇళ్లకు తిరిగి వారికి కలిగిన లబ్ధిని నేరుగా తెలుసుకున్నా అన్నారు. భీమిలి జోన్‌లో 19,062 మంది లబ్ధిదారులకు రూ.490 కోట్ల సంక్షేమ పథకాలు అందాయన్నారు. నియోజకవర్గంలో రూ.2500 కోట్ల అభివృద్ధి జరిగిందన్నారు. ఆసరా ద్వారా భీమిలి జోన్‌లో మహిళలకు రూ.132 కోట్లు సీఎం జగన్ పంపిణీ చేయగా చంద్రబాబు హయాంలో వీరికి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. కోవిడ్ కారణంగా మూడేళ్లపాటు రాష్ట్రంలో ఆదాయం తగ్గినా సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పథకాలను కొనసాగించారన్నారు.

24 సీట్లతో పవన్ పంచె ఊడిపోయింది..

ప్రతిపక్షాలకు డబ్బు, మీడియా బలం ఉన్నా నిజమైన హీరో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. గతంలో పంచెలు ఊడగొడతానని బీరాలు పలికిన పవన్... టీడీపీ నుంచి 24 సీట్లు తీసుకోవడంతో అతనికే పంచె ఊడిపోయిందన్నారు. టీడీపీ పరిష్కరించలేని 16 ఏళ్ల చిట్టివలస జ్యూట్‌మిల్లు లాకౌట్ సమస్య పరిష్కరించి రూ.36 కోట్లు కార్మికులకు పంపిణీ చేశామన్నారు. డీవీస్ రూ.2 కోట్ల సాయంతో ఆర్టీసీ కాంప్లెక్స్, భీమిలిలో రూ.25 కోట్లతో జెట్టీ నిర్మిస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో పవన్, చంద్రబాబును ఇంటికి పంపేందుకు అందరూ సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జెడ్సీ కనక మహాలక్ష్మి, కో ఆప్షన్ సభ్యురాలు కొప్పల ప్రభావతి, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, రెండో వార్డు ఇన్‌చార్జి శిల్లా సరళారాణి, జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి, వార్డు అధ్యక్షులు జగుపల్లి ప్రసాద్, అల్లిపల్లి నరసింగరావు, జిల్లా అనుబంధ సంఘాల నాయకులు డబ్బీరు ప్రశాంతి, జీవీ రమణ, సీనియర్ నాయకులు కొప్పల రమేష్, చేట్ల ఎల్లయ్యరెడ్డి, ఎస్.కరుణాకరరెడ్డి, చింతగుంట శివ, పాసి స్వర్ణలత, వాసుపల్లి కొండబాబు, చిల్ల బాబయ్యరెడ్డి, పందిరి విజయ్, చిల్ల సూర్యనారాయణరెడ్డి, సిమ్మల ప్రసన్న, చిల్ల ప్రమీల, చిల్ల గణేష్‌రెడ్డి, శీరపు నరసింహారెడ్డి, వంశీ తదితరులు పాల్గొన్నారు.



రూ.60 లక్షలతో కొనుగోలు చేసిన టిప్పర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

రూ.1.49 కోట్లతో షాపుల నిర్మాణం ప్రారంభం



నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఈఈ వేంకటేశ్వరరావు

భీమునిపట్నం: భీమిలి పెద్దబజారు మార్కెట్ వద్ద శిథిలమైన షాపుల స్థానంలో కొత్తవాటి నిర్మాణానికి సంబంధించిన పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. రూ.1.49 కోట్లతో నిర్మించనున్న షాపుల నిర్మాణానికి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఇటీవల శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత కొద్ది రోజులకే నిధులు కూడా విడుదల కావడంతో నిర్మాణ పనులు ప్రారంభించారు. అందులో భాగంగా ఇంతకు ముందు శిథిలమైన షాపులు తొలగించి ఆ స్థలాన్ని చదును చేయించారు. ఈఈ వేంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కొలతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడి స్థలంలో 8 షాపులు, 18 షెడ్లు నిర్మిస్తామని తెలిపారు. వీటి నిర్మాణం చాలా త్వరగా, రెండు నెలల్లో పూర్తి చేయడానికి నిర్ణయించామని, ఆ ప్రకారం పనులు జరుగుతాయన్నారు. నిర్మాణం పూర్తయిన తర్వాత కూరగాయలు, చేపలు విక్రయించే వారికి వాటిని కేటాయిస్తామని తెలిపారు. వీటిని నాణ్యతతో నిర్మించే విధంగా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని వెల్లడించారు. శంకుస్థాపన చేసిన కొద్ది రోజుల వ్యవధిలోనే నిధులు విడుదల కావడం, వెంటనే పనులు ప్రారంభం కావడంతో ఇక్కడి వ్యాపారులతోపాటు, ప్రజలు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



బాధిత కుటుంబ సభ్యులకు చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఆనందపురం : మండలంలోని శొంఠ్యాం ఎంపీటీసీ సభ్యురాలు భర్త అనారోగ్యానికి గురికావడంతో అతనికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు బాధిత కుటుంబ సభ్యులకు సోమవారం అందజేశారు. ఎంపీటీసీ సభ్యురాలు పల్లా దుర్గ భర్త పల్లా రమణ గత ఏడాది కాలంగా లివర్ సిరోసిస్ వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. అరుదైన వ్యాధి కావడంతో వైద్యం కోసం అప్పులు చేసి చాలా ఖర్చు పెట్టారు. చికిత్స చేయించడం భారంగా మారడంతో సాయం కోసం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుని ఆశ్రయించారు. ఈ మేరకు ఆయన విషయాన్ని సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా... సీఎం సహాయనిధి నుంచి రూ.10 లక్షల సాయాన్ని అందజేశారు. ఈ మేరకు తగరపువలసలోని క్యాంప్ ఆఫీసులో బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చెక్కు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ దాట్ల పెదబాబు, పార్టీ ఆనందపురం వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను, లెంక రాంబాబు, భీమిలి వైస్ ఎంపీపీ బోని బంగారు నాయుడు, తర్లువాడ, గిడిజాల సర్పంచ్‌లు బీఆర్‌బీ నాయుడు, షిణగం అప్పలరాజు, కోరాడ ముసిలినాయుడు పాల్గొన్నారు.

దోమల నియంత్రణకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్..



డ్రైనేజీలో రసాయనాలు పిచికారీ చేస్తున్న సిబ్బంది

తగరపువలస : జీవీఎంసీ భీమిలి జోన్‌లో దోమల నియంత్రణకు పారిశుధ్య, మలేరియా నివారణ విభాగాల సిబ్బంది సోమవారం చర్యలు చేపట్టారు. 'దోమలతో విలవిల' శీర్షికతో సాక్షిలో ప్రచురించిన వార్తకు వారు స్పందించారు. ఆదర్శనగర్, సంతపేట, సంగివలస సచివాలయాల పరిధిలో పలు డ్రైనేజీలు, నీటికుంటల్లో ఉదయం రసాయనాలు పిచికారి చేశారు. సాయంత్రం యంత్రాలతో ఫాగింగ్ చేపట్టారు. ఈ సందర్భంగా పలుచోట్ల దోమల నివారణకు తీసుకుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

మురుగు కూపంలో మంచినీటి బోరు



మంచినీటి బోరు చుట్టూ నిలిచిపోయిన మురుగు నీరు

ఆనందపురం : ఆనందపురం పంచాయతీ పరిధిలో కొత్తగా నిర్మించిన వైఎస్సార్ జగనన్న కాలనీ వద్ద ఏర్పాటు చేసిన మంచినీటి సరఫరా బోరు మురుగు కూపంలో ఉంది. దీంతో తాగునీరు కలుషితమవుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ సుమారు వంద కాలనీ ఇళ్లు నిర్మించారు. ఇక్కడి కాలనీ వాసుల కోసం మంచినీటి మోటారు బోరు ఏర్పాటు చేసి ఇంటింటికీ తాగునీరు అందించడానికి ఏర్పాట్లు చేశారు. కాగా మంచినీటి బోరు ఏర్పాటు చేసిన చోట నీరు లీకై అక్కడే నిల్వ ఉండిపోవడంతో పెద్ద గొయ్యి ఏర్పడింది. సుమారు రెండు అడుగుల మేర నీరు నిల్వ ఉండిపోవడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. మురుగు నీరు బోరు బావిలోకి ఇంకుతుండడంతో కలుషితమయ్యే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మంచినీటి బోరు వద్ద మురుగుని తొలగించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

అంబేడ్కర్ స్ఫూర్తితో రాష్ట్రంలో పాలన



అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

కొమ్మాది: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రంలో పరిపాలన సాగుతోందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. కొమ్మాది సమీప సేవానగర్‌లో సోమవారం సాయంత్రం అంబేడ్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత బడుగు, బలహీన వర్గాలను ఆదుకున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీదే అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నా ఎస్సీ, నా ఎస్టీ సోదరులు అంటూ వారి అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. కుల, మత, పార్టీ తారతమ్యాలు చూడకుండా అందరినీ సమానంగా చూస్తూ, అందరికీ సంక్షేమాన్ని అందిస్తున్న మనసున్న ప్రభుత్వమన్నారు. సేవానగర్‌లో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం ఎంతో ఆనందాన్నిచ్చిందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ముత్తంశెట్టి ప్రియాంక, వివిధ విభాగాల నాయకులు గాదె రోశిరెడ్డి, సియాద్రి కనకరాజు, గుంటుబోయిన సంజీవ్‌యాదవ్, అవతార్‌సింగ్, ఉమామహేష్, అనిల్ కుమార్, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

నేడు సీతారాముల వార్షిక కల్యాణోత్సవం



సీతారాముల ఉత్సవమూర్తులు

సింహాచలం: జీవీఎంసీ 98వ వార్డు సింహపురికాలనీలోని శ్రీ సీతారామాలయ 21వ వార్షిక కల్యాణ మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు రామ్మోహనరావు జ్యోతి ప్రజ్వలన-హమమత్ పతాక ఆవిష్కరణ చేసి మహోత్సవాలను ప్రారంభించారు. అనంతరం ఆలయ అర్చకులు అర్చకులు యాగశాల ప్రవేశాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం 9.30 గంటలకు సకల దేవతలకు కల్యాణ ఆహ్వానం పంపిస్తూ ధ్వజారోహణం, రాత్రి 7 గంటల నుంచి సీతారాముల వార్షిక కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. 28న ఉదయం 9.30 నుంచి సుదర్శన నారసింహ హవనం, సాయంత్రం 5 గంటల నుంచి స్వామివారి గ్రామ తిరువీధి నిర్వహిస్తారు. 29న 9.30 గంటలకు శ్రీ మద్రామాయణ సామూహిక పారాయణం, సాయంత్రం 6.30 గంటలకు కోలాటం, మార్చి1న ఉదయం 9.30 గంటలకు శ్రీ మహాలక్ష్మీ సామూహిక కుంకుమార్చన, 2న ఉదయం 10 గంటల నుంచి స్నపనం, చక్రస్నానం, వసంతోత్సవం, పూర్ణాహుతి, అవబృత స్నానం, సాయంత్రం 6గంటల నుంచి శ్రీపుష్పం,ఉంగాం, ఊంజల్‌సేవ, ఋత్విక్ సన్మాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

అందుబాటులోకి 'ఎక్స్‌రే' సదుపాయం

భీమిలి ప్రభుత్వ ఆస్పత్రిలో రూ.20 లక్షలతో ఏర్పాటు



భీమిలి ప్రభుత్వ ఆస్పత్రిలోని ఎక్స్‌రే ప్లాంట్



డిజిటల్ ఎక్స్‌రే క్యాసెట్ రీడర్ పరికరం

భీమునిపట్నం: భీమిలి ప్రభుత్వ ఆస్పత్రిలో ఎక్స్‌రే సదుపాయం అందుబాటులోకి వచ్చింది. చాలా సంవత్సరాలుగా ఈ సదుపాయం లేకపోవడంతో రోగులు శ్రమ, వ్యయంతో వేరే ప్రాంతాలకు వెళ్లి ఎక్స్‌రేలు తీయించుకోవాల్సి వచ్చేది. అయితే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆస్పత్రికి కొత్త భవనం నిర్మించి అందుబాటులోకి తీసుకొచ్చారు. అనంతరం అవసరమైన మౌలిక సదుపాయాలు, వైద్య పరికరాలు సమకూర్చారు. ఈ క్రమంలో కొద్ది రోజుల కిందట రూ.20 లక్షలతో ఎక్స్‌రే విభాగం ఏర్పాటు చేయగా అది రోగులకు అందుబాటులోకి వచ్చింది. ఇది ఆధునికంగా పనిచేస్తుందని సిబ్బంది చెబుతున్నారు. ప్రమాదాల్లో గాయపడిన వారితోపాటు దగ్గు ఎక్కువగా వస్తుంటే ఛాతీకి, నడుము నొప్పికి, కాళ్లు, చేతుల నొప్పులకు, తలకు సంబంధించి రేడియో గ్రాఫర్ ఎక్స్‌రేలు తీశాక డిజిటల్ ఎక్స్‌రే క్యాసెట్ రీడర్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారని తెలిపారు. దీన్ని వైద్య నిపుణులు పరిశీలించి రోగులకు ఏ విధమైన వైద్యం అందించాలో సూచిస్తూ రిపోర్టు పంపిస్తారని... దాని ప్రకారం చికిత్స చేయించుకోవాల్సి వుంటుందని తెలిపారు. ఈ విధానం చాలా ఉపయోగకరంగా వుంటుందని, ప్రస్తుతం రోజుకు పది నుంచి 15 మంది రోగులు ఎక్స్‌రే తీయించుకుంటున్నారని తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న ఎక్స్‌రే సేవలు అందుబాటులోకి రావడంతో అందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

'స్పందన'కు 12 అర్జీలు

మధురవాడ : జీవీఎంసీ మధురవాడ జోన్ – 2లో జెడ్సీ శైలజవల్లి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన 'స్పందన'కు వివిధ సమస్యలపై 12 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా ఆమె ప్రజలు నుంచి వినతులు స్వీకరించారు. హౌసింగ్ బోర్డు కాలనీలో రోడ్డు పునర్నిర్మించాలని వరసిద్ధి వినాయక ఏపీహెచ్‌బీ కాలనీ ఎల్‌ఐజీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. చాణక్యపురి లేఅవుట్‌లో వీధిలైట్ల ఏర్పాటు, రోడ్లు, కాలువలు, కన్వెన్షన్ హాలు, రోడ్డుని ఆనుకుని ఉన్న కాలువకి రిటైనింగ్ వాల్ నిర్మించాలని సుందర్‌నగర్ కృష్ణ చాణక్యపురి గుప్తా పీర్లెస్ లే అవుట్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపడతామని జోనల్ కమిషనర్ హామీ ఇచ్చారు.

'స్పందన'కు నాలుగు వినతులు

భీమునిపట్నం : భీమిలి జోనల్ కార్యాలయం వద్ద సోమవారం జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన 'స్పందన' కార్యక్రమంలో నాలుగు వినతులు వచ్చాయి. పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించినవే వచ్చాయని, వాటిని పరిశీలించి పరిష్కరిస్తామని జెడ్సీ తెలిపారు.

బాల రాముని దివ్య తేజస్సు అద్భుతం



చిదంబరం శాస్త్రితో ఆలయ కమిటీ ప్రతినిధులు

మధురవాడ : బాల రాముని దివ్య తేజస్సు, గొప్పతనం వర్ణించడం సాధ్యం కాదని విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న, హనుమద్ చాలీసా ఉపాసకులు డాక్టర్ బ్రహ్మశ్రీ అన్నదానం చిదంబరం శాస్త్రి చెప్పారు. సోమవారం సాయంత్రం మిథిలాపురి వుడా కాలనీ బాలాజీ హిల్స్‌పై కొలువైన శ్రీ భూనీలా సమేత వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆయన రామతత్వం, బాల రాముని దివ్యమనోహర నామంపై ఉపన్యసించారు.

అయోధ్యలో రామ విగ్రహ ప్రతిష్టలో పాల్గొనడంతో గొప్ప అనుభూతి కలిగిందని, బాల రాముని దివ్య మనోహర రూపం గురించి చెప్పినా, రామనామం పఠించినా తనివి తీరదన్నారు. అనంతరం ఆలయ కమిటీ సెక్రటరీ మగ్గూరి వెంకటరావు, ట్రస్టీ గరిమెళ్ల నాగేశ్వరరావు తదితరులు చిదంబరం శాస్త్రి దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సమన్వయకర్త కె.లక్ష్మి కృష్ణవేణి, ఆలయ అర్చకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అయోధ్యలో నృత్య ప్రదర్శనకు పెందుర్తి కళాకారులు



సాధన చేస్తున్న కళాకారులు

పెందుర్తి: అయోధ్య రామ మందిరం ప్రాంగణంలో నృత్యం చేసే అవకాశాన్ని చినముషిడివాడలోని నిర్మల నృత్యనికేతన్ విద్యార్థులు సొంతం చేసుకున్నారు. బాలరాముని చెంత ప్రదర్శన ఇచ్చేందుకు నృత్య నికేతన్ ప్రిన్సిపాల్ బి.విజయజ్యోతి సారథ్యంలో కళాకారులు బయలు దేరారు.

దృఢ సంకల్పంతో విధులు నిర్వర్తించాలి

ఆరిలోవ: రానున్న ఎన్నికల్లో పోలీసులు దృఢ సంకల్పంతో విధులు నిర్వర్తించాలని అనకాపల్లి ఎస్పీ కె.వి మురళీకృష్ణ తెలిపారు. విశాలాక్షినగర్ ఏఆర్ పోలీస్ మైదానంలో సోమవారం జరిగిన మొబలైజేషన్ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయనకు కవాతుతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వృత్తిపరమైన, వ్యక్తిగత క్రమశిక్షణతో పోలీసులు విధులు నిర్వహించాలన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి పోలీసులు కృషి చేయాలన్నారు. ఇటీవల విజయవాడలో జరిగిన 32వ ఆర్సీ కోర్సులో మత్తు పదార్థాలను గుర్తించడంలో మొదటి బహుమతి పొందిన అల్లూరి సీతారామరాజు జిల్లా పోలీస్ విభాగానికి చెందిన రాకీ(జాగిలం), పేలుడు పదార్థాలను గుర్తించి రెండో స్థానంలో నిలిచిన అనకాపల్లి జిల్లాకు చెందిన వోల్గా(జాగిలం) శిక్షకులను అభినందించారు. అదనపు ఎస్పీలు బి.విజయభాస్కర్, పి.సత్యనారాయణ, వి.సత్తిబాబు, డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఆర్ఐలు సతీష్, అరవింద్ పాల్గొన్నారు.

ప్రజా రవాణాతో పర్యావరణానికి మేలు

డాబాగార్డెన్స్: వారంలో ఒక్కరోజు ప్రజా రవాణా వినియోగించడం ద్వారా నగర కాలుష్యాన్ని అరికట్టవచ్చని మేయర్ గొలగాని హరివెంకటకుమారి అన్నారు. సోమవారం ఆమె తన క్యాంప్ ఆఫీస్ నుంచి జీవీఎంసీ కార్యాలయానికి ఏపీఎస్ ఆర్టీసీ బస్సులో చేరుకోగా.. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తన బంగ్లా నుంచి సైకిల్‌పై కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో కాలుష్య నియంత్రణకు వారంలో ఒక రోజు జీవీఎంసీ ఉద్యోగులతోపాటు అందరూ ప్రజా రవాణాను వినియోగిస్తున్నామని తెలిపారు. ఎకో-వైజాగ్ అభివృద్ధి నేపథ్యంలో ఎకో జీరో పొల్యూషన్ కార్యక్రమంలో భాగంగా నగరంలో పర్యావరణ పరిరక్షణకు, కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ అనేక అవగాహన చర్యలు చేపడుతోందన్నారు. కాలుష్య నియంత్రణకు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, కళాశాలల యాజమాన్యం, పరిశ్రమల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు సహకరించి వారంలో ఒకరోజు ప్రజా రవాణా వ్యవస్థ వినియోగించాలని విజ్ఞప్తి చేశారు.

రైల్వే టికెట్ ధరల తగ్గింపుపై హర్షం

తగరపువలస : పాసింజర్ రైళ్లలో టిక్కెట్ ధరలను 50 శాతం తగ్గించడానికి రైల్వే శాఖ అంగీకారం తెలపడంపై నగరానికి చెందిన సామాజిక కార్యకర్త గొనప అప్పన్న హర్షం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కోవిడ్ వ్యాప్తి సమయంలో సాధారణ పాసింజర్ రైళ్లను స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైళ్లుగా మారుస్తూ అన్ రిజర్వ్‌డ్ టిక్కెట్లపై కూడా 50 శాతం ఛార్జీలు పెంచిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుతం దేశంలో కోవిడ్ తగ్గుముఖం పట్టినందున పాసింజర్ రైళ్ల టికెట్ ధరలు తగ్గించాలని కోరుతూ ప్రధానమంత్రి, రైల్వే మంత్రిత్వ శాఖకు లేఖలు రాశామని తెలిపారు. ఈ క్రమంలో వీటిపై ఆధారపడి ప్రయాణం సాగిస్తున్న పేద, మధ్య తరగతి, దినసరి కూలీలు, చిరుద్యోగులపై ఛార్జీల భారాన్ని కేంద్రం గుర్తించి, తగ్గించినందుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

ఈఎన్‌టీ ఆస్పత్రిలో నూతన పరికరాలు ప్రారంభం



పరికరాలు ప్రారంభిస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ ఆచార్య బుచ్చిరాజు

ఏయూక్యాంపస్: ప్రభుత్వ చెవి, ముక్కు, గొంతు(ఈఎన్‌టీ) ఆస్పత్రిలో పీజీ విద్యార్థులకు ఉపయుక్తంగా నిలిచే ఉపకరణాలు అందుబాటులోకి వచ్చాయి. వీటిని ఆంధ్రా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బుచ్చిరాజు సోమవారం ప్రారంభించారు. చెవి ఎముక (టెంపోరల్) బోన్ చికిత్స విధానం చేయడంపై శిక్షణ అందించే విధంగా ఈ ప్రయోగశాలను ఏర్పాటు చేశారు. రెండు మైక్రోస్కోప్‌లు, వీడియో స్టేషన్లతో ప్రత్యక్షంగా వీక్షించే విధంగా అందుబాటులో ఉంచారు. చెవికి సంబంధించిన శస్త్ర చికిత్సలు చేయడానికి, నిపుణులుగా పీజీ విద్యార్థులను తీర్చిదిద్దడానికి ఈ ప్రయోగశాల ఉపయుక్తంగా నిలుస్తుందని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరికృష్ణ తెలిపారు. ఆస్పత్రి వైద్యులు, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.